విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, శుక్రవారం 18, ఏప్రిల్ 2025

రెవెన్యూ అంశాలపై ప్రత్యేక దృష్టి సారించండి

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల: రెవెన్యూ అంశాలపై తాసీల్దార్లు ప్రత్యేక దృష్టి సారించి ప్రజలకు మెరుగైన రీతిలో సర్వీసులు ఇచ్చేందుకు సానుకూల దృక్పథంతో వ్యవరించాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాలులో రెవెన్యూ, రీసర్వే అంశాలపై రెవెన్యూ సిబ్బందికి జిల్లా కలెక్టర్ వర్క్ షాప్ నిర్వహించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో ఇంచార్జి జేసీ రామునాయక్, నంద్యాల, ఆత్మకూరు, డోన్ ఆర్డీఓలు విశ్వనాథ్, అరుణజ్యోతి, నరసింహులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ ఫ్రీ హెూల్డ్ భూములు, రీసర్వే, 22ఏ, జాతీయ రహదారుల భూ సేకరణ తదితర రెవెన్యూకు సంబంధించిన అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి మెరుగైన రీతిలో సర్వీసులు ఇచ్చేందుకు సానుకూల దృక్పథంతో వ్యవరించాలని తాసిల్దార్లను ఆదేశించారు. రెవెన్యూ అంశాలపై రెవెన్యూ సిబ్బందికి పూర్తి అవగాహన ఉండాలన్నారు. జిల్లాలో వివిధ పరిశ్రమలు ఏర్పాటు చేయడానికి ప్రభుత్వ భూములు గుర్తించడంలో రెవెన్యూ అధికారులు తాత్సారం చేస్తున్నారని, జిల్లాలో సుమారు 5 లక్షల ఎకరాల ప్రభుత్వ భూములున్నాయని, ఇందుకు తహశీల్దార్లు ప్రత్యేక దృష్టి సారించి భూముల విస్తీర్ణం, సంబంధిత భూములు ఏ సర్వే నెంబరులో వుందో తెలుసుకోవడానికి ఇన్వెంటర్ రిజిస్టర్లు నిర్వహించాలని తాసిల్దార్లను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం జిఓఎంఎస్ నెం.30 ప్రకారం 150 చదరపు అడుగుల వరకు ఆక్రమణలకు గురైన భూములు నియమ నిబంధనల మేరకు ఉచితంగా క్రమబద్ధీకరణ కొరకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రైవేటు భూములను 22(ఎ) కింద మార్పులు చేస్తే సంబంధిత తాసిల్దార్లపై చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. వెబ్ ల్యాండ్లో ఒకరి పేరుకు బదులు ఇంకొకరి పేరు మీద అనుచితంగా మార్పులు, చేర్పులు చేస్తే సంభదిత అధికారులపై చర్యలు తప్పవన్నారు.

ఎంపీని కలిసిన బేడ బుడగజంగాలు

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : నంద్యాల ఎంపి బైరెడ్డి శబరి స్వగృహం నందు బేడ బుడగ జంగం రాష్ట్ర అధికార ప్రతినిధి, నంద్యాల టౌన్ 38వ వార్డు వైఎస్ఆర్ నగర్ టిడిపి ఇంచార్జ్ తాటికొండ బుగ్గరాముడు మర్యాద పూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా బుగ్గ రాముడు మాట్లాడుతూ ఢిల్లీ పార్లమెంట్ నందు బేడ బుడగ జంగాల గురించి ప్రస్తావించిన ఎంపీ బైరెడ్డి శబరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి వర్గ సమావేశంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన బేడ, బుడగ జంగాలను ఏస్సి జాబితాలో చేర్చాలని కేంద్రానికి లేఖ పంపిన సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలుపుకుంటు, మరొకసారి ఢిల్లీ పార్లమెంట్ నందు బేడ, బుడగ జంగం గురించి ప్రస్తావించి రేపు జరగబోయే మెగా డిఎస్సిలో కూడా మా కులమును ఎస్సిలుగా గుర్తించి రిజర్వేషన్ కల్పించాలని కోరారు. అంతేకాక స్కూల్, కాలేజీలు చదివే విద్యార్థిని, విద్యార్థులకు సర్టిఫికెట్లలో ఎస్సి జాబితాగా చేర్చాలని, ఏస్సి సర్టిఫికెట్లు అందేలా చూడాలని ఎంపీ శబరిని కోరారు. బేడ బుడగజంగాల డివిజనల్ అధ్యక్షులు శిర సాల జమ్మన్న, శివశంకర్, సుధాకర్, రమణ, మౌలాలి, రామకృష్ణ తదితర బేడ బుడగ జంగాల నాయకులుపాల్గొన్నారు.

పొగాకు బెర్లకు నిప్పు రూ.8 లక్షలు నష్టం

విశాలాంధ్ర - బనగానపల్లె : బనగానపల్లె మండలంలోని టంగుటూరు గ్రామానికి చెందిన ఆకుమల్ల రాజన్నకు చెందిన పొగాకు బెర్లకు నిప్పంటుకోవడంతో రూ.8 లక్షలు మేరకు పట్ల నష్టం వాటిల్లింది. రాజన్న మాట్లాడుతూ ఐదు ఎకరాలు కౌలుకు తీసుకొని పొగాకు పంటను సాగు చేయడం జరిగిందని, బుధవారం రాత్రి 10 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడం జరిగిందని, దాదాపు రూ.8 లక్ష పంట నష్టం వాటిల్లిందన్నారు. తమకు ఎవరిపై ఎలాంటి కక్షలు లేవని, గుర్తు తెలియని దుండగులు ఈ నిప్పు పెట్టి, తమ కడుపు కొట్టారని ఆవేదన చెందారు.

ఉర్దూ భాషా ప్రాముఖ్యతపై పోస్టర్ విడుదల

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : రాష్ట్ర ఉర్దూ అకాడమి ఆధ్వర్యంలో ఉర్దూ భాషాభివృద్ధి కార్యక్రమంలో భాగంగా ఉర్దూ భాషా ప్రాముఖ్య తపై రూపొందించిన వాల్ పోస్టర్లను రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ఆవిష్కరించారు. మంత్రి ఫరూక్ మాట్లాడుతూ ఉర్దూ భాషా మన దేశ భాషా అని, గంగ, జమున తేహజీబ్‌కు ఉర్దూ భాషా అత్యున్నత ప్రతీక అన్నారు. ఉర్దూ భాషా ఒక ప్రాంతం, ఒక వర్గం, ఒక మతానికి చెందినది కాదని, ఇది అందరి భాషా అన్నారు. మనందరం ఉర్దూ భాషను నేర్చుకోవడం, మాట్లాడడం నేర్చుకొని అందులోని మాధుర్యాన్ని చవిచూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ డైరెక్టర్ షేక్ మహమ్మద్ గౌస్ పీర్, నేషనల్ కళాశాలల ఏవో రఫీ అహ్మద్, హాఫీజ్ అమ్జద్ బాష తదితరులు పాల్గొన్నారు

ఇష్టపడి చదివితే దేన్నైనా సాధించవచ్చు

విశాలాంధ్ర - గడివేముల: ఇష్టపడి చదివితే దేన్నైనా సాధించ వచ్చునని గడివేముల మోడల్ స్కూల్ విద్యార్థులు నిరూపించారని గడివేముల ఎస్సై నాగార్జున రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని గురువారం నాడు మోడల్ స్కూల్లో ఏర్పాట చేసిన విద్యార్థుల సన్మాన సభలో ఆయన మాట్లాడుతూ గత నాలుగు రోజులకు క్రితం ద్వితీయ సంవత్సరంలో మండల టాపర్ గా నిలిచిన ఫైజా 1000 మార్కులకు గాను 981 బైపిసి బి.మానస ఎంపీసీలో 918 మార్కులు సి.మానస సీఈసీలో 890 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచిన విద్యార్థులను సన్మానించి షీల్డ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి కన్వీనర్ దేశం సత్య నారాయణరెడ్డి, మైనార్టీ నాయకులు ఫారుక్, విద్యా కమిటీ చైర్మన్ ఈశ్వర్ రెడ్డి, మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ శైలజ, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీస్తు ముఖావళిని రూపొందించిన చిత్రకారుడు

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ: పట్టణానికి చెందిన ప్రముఖ చిత్రకారుడు విజయ్ నేడు శుభ శుక్రవారం సందర్భంగా దైవ కుమారుడైన క్రీస్తు సిలువపై వ్రేలాడుచు పలికిన ఏడు మాటలను ఏసుక్రీస్తు ముఖం ఏర్పడే లాగున ముఖావళిని రూపొందించాడు. అందులో భాగంగా తండ్రి వీరేమి చేయుచున్నారో వీరెరుగరు కనుక వీరిని క్షమింపుము, నేడు నీవు నాతో కూడా పరదైసులో ఉందువు, అమ్మ ఇదిగో నీ కుమారుడు ఇదిగో నీ తల్లి, నా దేవా నా దేవా నన్నెందుకు చేయి విడిచితివి, నేను దప్పిగోనుచున్నాను, సమాప్తమైనది, తండ్రి నీ చేతికి నా ప్రాణమును అప్పగించుచున్నాను అని పలికిన ఏసుక్రీస్తు తన ప్రాణమును వదిలాడు. శుభ శుక్రవారాన్ని పురస్కరించుకొని ఏసు పలికిన అక్షరాలతో యేసుక్రీస్తు ముఖావళిను రూపొందించి ఏసుక్రీస్తు పట్ల తనకున్న భక్తి భావాన్ని విజయ్ చాటుకున్నాడు.

19న పూర్వ విద్యార్థుల సమావేశం

విశాలాంధ్ర - నందికొట్కూరు: పట్టణంలోని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల నందు ఈనెల 19న శనివారం ఉదయం 9:30 గంటలకు అత్యవసర పూర్వ విద్యార్థుల సమావేశాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని, పూర్వ విద్యార్థుల సంఘ అధ్యక్షులు శ్రీరామ, శ్రీకృష్ణ థియేటర్ యజమాని ఎం.రామిరెడ్డి గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన తెలియజేస్తూ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్ సునీత అధ్యక్షతన ఈ సమావేశం నిర్వహించడం జరుగుతుందని, ఈ సమావేశానికి వైస్ ప్రెసిడెంట్, సెక్రటరీ, జాయింట్ సెక్రెటరీ, ట్రెజరర్ ఇతర మెంబర్స్, పూర్వ విద్యార్థులందరూ అందరూ తప్పనిసరిగా హాజరై జయప్రదం చేయవలసిందిగ కోరారు. కళాశాల అభివృద్ధికై విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని, ఈ సమావేశానికి తప్పనిసరిగా హాజరు కావడం సామాజిక బాధ్యత అన్నారు.

కరిగిపోతున్న కొండలు

- యదేచ్ఛగా అక్రమ గ్రావెల్ తవ్వకాలు
- కన్నెత్తి చూడని అధికారులు

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల: గ్రావెల్ తవ్వకాలతో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. చిట్టడుగులు పచ్చదనంతో కళకళలాడాల్సిన కొండలు కనుమరుగవుతున్నాయి. యదేచ్ఛగా సాగుతున్న అక్రమ గ్రావెల్ తవ్వకాలతో కొండలు అదృశ్యం అవుతున్నాయి. గతంలో ఎన్నడు లేని విధంగా అక్రమార్కులు రెచ్చిపోతున్న సంబంధిత అధికారులు కన్నెత్తి చూడడం లేదు. పవర్ గ్రిడ్ నిర్మాణానికి గ్రావెల్ తరలింపుతో అక్రమార్కులు జేబులు నింపుకొంటుండగా సహజ సిద్ధమైన ప్రకృతి నాశనం అవుతున్నది. అక్రమ తవ్వకాలతో భారీ గుంతలు ఏర్పడి కుంటలు, చిన్నపాటి చెరువులను తలపిస్తున్నాయి. మండలంలోని ఎస్ చెన్నంపల్లి, తిమ్మనాయుని పేట గ్రామాల మధ్య మండలంలోని అతిపెద్ద తిమ్మనాయునిపేట చెరువు పక్కన గత కొన్ని నెలలుగా అక్రమార్కులు రెచ్చిపోతూ గ్రావెల్ తవ్వకాలు సాగిస్తున్నారు. భారీ ఎత్తున తవ్వకాలు జరుగుతున్న సంబంధిత అధికారులు అటువైపు కన్నీటి చూడడం లేదు. రేయింబవళ్లు ప్రొక్లైన్లతో తవ్వకాలు చేస్తూ టిప్పర్ల ద్వారా గ్రావెల్ ను పవర్ గ్రిడ్‌కు తరలిస్తున్నారు. తవ్వకాలతో పచ్చదనం కను మరుగు కావడంతో వన్యప్రాణులు కూడా అదృశ్యం అవుతున్నాయి. ఒకవైపు ప్రభుత్వం చెట్లను నాటి పచ్చదనం పెంచాలని, ఉన్న చిన్నపాటి చిట్టడుగులను కాపాడుకోవాలని విశ్వ ప్రయత్నం చేస్తుంటే మరోవైపు మాత్రం అక్రమా ర్కులు ఆడిందే ఆటగా పాడిందే పాటగా సాగుతు న్నది. ప్రభుత్వం నిజంగానే ఇంత పెద్ద ఎత్తున తవ్వకాలకు అనుమతి ఇచ్చిందా అన్నది కూడా ప్రజల్లో పలు అనుమానాలను రేకెత్తిస్తున్నది. మండలంలో ఎక్కడో చిన్నపాటి తవ్వకాలు జరిపితేనే రెక్కలు కట్టుకొని వాలిపోయే రెవెన్యూ అధికారులు ఇంత తతంగం జరుగుతున్న మౌనం దాల్చడం వెనుక అనుమానాలకు దారితీస్తున్నది. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి చిట్టడుగులను ప్రకృతి సంపదను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

నేషనల్ టాలెంట్ నందు ప్రతిభ విద్యార్థులు

విశాలాంధ్ర - నందికొట్కూరు: ఇండియన్ నేషనల్ టాలెంట్ పరీక్ష పోటీలలో శ్రీ చైతన్య విద్యార్థులు ప్రతిభా చాటడం జరిగిందని పాఠశాల ప్రిన్సిపాల్ దీప గురువారం విలేకరులకు తెలిపారు. శ్రీ చైతన్య పాఠశాలలో ఒలంపియాడ్ పరీక్షల్లో 179 మంది ప్రతిభ చాటారని, ట్యాబ్ మొదటి బహుమతి షేక్ షాహిన్, షేక్ నహీదా నూర్ కైవసం చేసుకున్నారన్నారు. రెండో బహుమతి ఇద్దరు, మూడో బహుమతి ఇద్దరు, నాలుగో బహుమతి ముగ్గురు, ఐదవ బహుమతి ఇద్దరు, కన్సోలేషన్ ప్రైస్ గోల్డ్ మెడల్, మెరిట్ సర్టిఫికెట్-63 మంది కన్సోలేషన్ ప్రైస్ మరియు గోల్డ్ మెడల్-11 గోల్డ్ మెడల్-27 గోల్డ్ మెడల్ మెరిట్ సర్టిఫికెట్ -59 విద్యార్థులు ప్రత్యేక బహుమతులు గెలుచుకోవడం జరిగిందన్నారు. గోల్డ్ మెడల్-8 మంది సాధించారని వీరిని ఏజీఎం సురేష్, ఆర్ఐ చౌదరి, కోఆర్డినేటర్ రమణయ్య డీన్‌ఉమామహేశ్వరరావు ఏఓగోపాల్ రెడ్డి, ఉపాధ్యాయ బృందం విద్యార్థులను అభినందించడం జరిగిందన్నారు.

నేడు అహెూబిలానికి కేంద్ర మంత్రి రాక

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ: కేంద్ర బొగ్గు,గనులు, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి శుక్రవారం అహెూబిలంకు రానున్నారు. ఓర్వకల్లు మండలంలోని పిన్నాపురం గ్రీన్ కోప్రాజెక్టును మంత్రి ప్రహ్లాద్ జోషి సందర్శించిన అనంతరం హెలికాప్టర్ ద్వారా మధ్యాహ్నం 3 గంటలకు అహెూబిలం క్షేత్రానికి చేరుకొని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకోనున్నారు. మంత్రి రాక సందర్భంగా గురువారం అహెూబిలం జడ్పీ పాఠశాల ఆవరణలో హెలిప్యాడ్, భద్రత ఏర్పాట్లను ఆళ్లగడ్డ రూరల్ సీఐ దాది మురళీధర్ రెడ్డి పరిశీలించారు.

కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తులు చేసుకోండి

విశాలాంధ్ర - పాములపాడు: మండలంలోని షెడ్యూల్డ్ కులాల వర్గాలకు ఆర్థికంగా స్థిరపడేందుకు ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల మేరకు బ్యాంకుల 2024-25 వార్షిక సంవత్సరానికి మంజూరు చేయుటకు జిల్లా కలెక్టర్ లక్ష్యాలు నిర్ణయించారని ఎంపీడీవో చంద్రశేఖర్ గురువారం తెలిపారు. 13 యూనిట్లు సంబంధిత బ్యాంకులకు కేటాయించారని, అర్హత గల వ్యక్తులు 21 నుంచి 50 ఏళ్ల లోపల వయసు ఉన్న వారు రేషన్ కార్డు ఆధార్ కార్డు కుల ధ్రువీకరణ పత్రాలతో ఆన్లైన్ నందు మే 10లోపు దరఖాస్తు చేసుకొనవచ్చని తెలిపారు.

పొంచి ఉన్న ప్రమాదం

విశాలాంధ్ర - డోన్ రూరల్: స్థానిక కంబలపాడు సర్కిల్‌లో ఓ చెట్టు కొమ్మ విరిగి విద్యుత్ తీగలపై వ్రేలాడుతూ ప్రమాదం పొంచి ఉంది. నిత్యం అనేకమంది కాలినడకనే కాకుండా ఆటోలు, ద్విచక్ర వాహనాలు, స్కూల్ బస్సులు, గ్రామాలకు వెళ్లే పల్లె వెలుగు బస్సులు అదే దారిలో రోజుకు వందల వాహనాలు తిరగడమే కాకుండా స్కూలుకు వెళ్లే చిన్నపిల్లలు కూడా వెళుతూ ఉంటారు. భారీగా పెరిగిన తైలం చెట్టు కొమ్మ విరిగి ఓ పక్కకు ఒరిగి పోవడమే కాకుండా కొమ్మ కింద విద్యుత్ తీగలు కూడా ఉండడం వలన ఎప్పుడు ఏమి జరుగుతుందోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు త్వరగా చర్యలు తీసుకుని పొంచి ఉన్న ప్రమాదం నుండి ప్రాణనష్టం జరగకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

వాట్సాప్ ద్వారా సేవలను సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర - చాగలమర్రి : కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వాట్సప్ మనమిత్ర సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఈఓపిఆర్‌డి తాహీర్‌హుసేన్ పిలుపు నిచ్చారు. చాగలమర్రి మండల పరిషత్ కార్యాలయంలో మనమిత్ర గోడపత్రికలను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మనమిత్ర ద్వారా వాట్సప్‌లో సుమారు 250 వివిద రకాల సేవలు ఈ నెల 15 నుంచి అందుబాటులోకి వచ్చాయన్నారు.కుల,ఆదాయ,రెవెన్యూ తదితర సేవలను వాట్సప్ నెంబర్ 9552300009ను డౌన్‌లోడు చేసుకొని మెసేజ్ పంపి పొందవచ్చన్నారు. మనమిత్ర వాట్సాప్ ద్వారా కార్యాలయాల చుట్టూ తిరగకుండా త్వరితగతిన పొందవచ్చన్నారు. సచివాలయాల సిబ్బంది ఆయా సచివాలయాల పరధిలోని ఇంటింటికి వెళ్ళి మనమిత్రపై అవగాహన కల్పిస్తారన్నారు.కార్యక్రమంలో పిఆర్ ఏఈ కొండారెడ్డి, పంచాయతి కార్యదర్సులు వెంకటేశ్వర్లు, సబియా, ఆదినారాయణ, నాగార్జున, సుజాత, మనోజ్, ఎంసీఓ రాజ్‌కుమార్, డిపి మధు, పంచాయతి సిబ్బంది షేక్షా తదితరులు పాల్గొన్నారు.

లారీ ట్రాక్టర్‌ను ఢీకొని డ్రైవర్ మృతి

విశాలాంధ్ర - ప్యాపిలి: మండల పరిధిలోని పోతుదొడ్డి గ్రామ సమీపంలో బుధవారం జాతీయ రహదారిపై లారీ వెనకనుంచి ట్రాక్టర్‌ను డీకొనడంతో ట్రాక్టర్ డ్రైవర్ నాగేంద్ర ప్రసాద్ (23) అక్కడికక్కడే మృతి చెందాడు. బనగానపల్లె తాలూకాకు చెందిన సాదు కొట్టాల గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవరు నాగేంద్ర ప్రసాద్ వరిగడ్డి లోడుతో గుత్తికి బయలుదేరాడు. పోతుదొడ్డి గ్రామ సమీపంలోకి రాగానే లారీ వెనకనుంచి ట్రాక్టర్‌ను ఢీకొంది. దీంతో అక్కడికక్కడే ట్రాక్టర్ డ్రైవరు మృతి చెందాడు. వరిగడ్డి ట్రాక్టర్ రోడ్డుకు అడ్డం పడడంతో వాహనాలు ఇరువైపులా నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న సీఐ వెంకటరామిరెడ్డి, సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని జేసీబీ వాహనంతో ట్రాక్టర్‌ను తొలగించి యధావిధిగా వాహనాల రాకపోకలను కొనసాగించారు.

పరీక్షల్లో మార్కులే జీవితమా..

విశాలాంధ్ర - ఆత్మకూరు రూరల్ : జిల్లా కెరీర్ మెంటల్ హెల్త్ కౌన్సిలర్ల ఆధ్వర్యంలో ఆత్మకూరులోని కేజీబీవి పాఠశాల, కొత్తపల్లి మండల కేంద్రంలోని స్థానిక కేజీబీవీ బాలికల పాఠశాలల్లో పరీక్షల మార్కులే జీవితమా అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నంద్యాల జీసిడిఓ నాగ సువ ర్చాలా నేతృత్వం వహించారు. 10వ తరగతి విద్యార్థులకు రాబోయే పరీక్షల, ఫలితాల పట్ల మానసికంగా దృఢంగా ఉండేలా ప్రోత్సహించడంతో పాటు, కేవలం పరీక్షలు మరియు మార్కులకే ప్రాధాన్యత ఇవ్వకుండా జ్ఞానసంపాదన, క్రమశిక్షణ, సమయపాలన, పట్టుదల వంటి లక్షణాలు జీవిత విజయానికి కీలకమని తెలిపారు. ఆశించిన స్థాయిలో మార్కులు రాకపోయినా, ఒత్తిడికి గురికాకుండా మరింత కృషిచేసి విజయం సాధించవచ్చచ్చాన్నారు. మెంటల్ హెల్త్ కౌన్సిలర్లు శ్రీరామ్, నాగన్న, సునీత వివరించారు. కేజీబీవీ ప్రిన్సిపాల్ కృష్ణబాయి పాల్గొన్నారు.

ఎస్సీ కార్పోరేషన్ రుణాలు విడుదల : ఎంపీడీవో

విశాలాంధ్ర - శిరివెళ్ల : మండల పరిధిలోని ఆయా గ్రామాలలో గల అర్హులైన ఎస్సీల నుండి ఎస్సీ కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీఓ సి శివ మల్లేశ్వరప్ప తెలిపారు. 2025 - 26 సంవత్సరానికి ఎస్సీ కార్పోరేషన్ ద్వారా ఆర్థిక చేయూత అందించడానికి ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసిందనీ తెలిపారు. దీని ప్రకారం ఏప్రిల్ 11 నుండి రాష్ట్ర వ్యాప్తంగా ఆన్ లైన్ రిజిస్ట్రేషన్స్ ప్రారంభం అయ్యిందని సూచించారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

విశాలాంధ్ర-డోన్: బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరం అందుకు ప్రోత్సహించిన వారు బాల్యవివాహాల నిషేధ చట్టం 2006 ప్రకారం రూల్స్ 2023 ప్రకారం శిక్షార్హులని డోన్ మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ గౌడ్ అన్నారు. గురువారం పట్టణంలో డోన్ మున్సిపల్ పురపాలక సంఘం కార్యాలయంలో మున్సిపల్ స్థాయి బాల్య వివాహాల నిర్మూలనపై సమన్వయ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో ఐసీడియాస్ సిడిపిఓ, వార్డు సచివాలయ మహిళా సంరక్షణ కార్యదర్శులు, వార్డ్ అడ్మిన్ సెక్రటరీలు, వార్డ్ ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీలు, మెప్మా రిసోర్స్ పర్సన్స్, సూపర్వైజర్లు, వార్డు రెవెన్యూ సెక్రెటరీల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి పలు అంశాలపై చర్చించారు. మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ వేసవి సెలవులలో బాల్య వివాహాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉందని, అలా జరగ కుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐ ఇంతియాజ్ బాష మాట్లా డుతూ పోలీస్ శాఖ ప్రజలలో బాల్య వివాహాలు జరగకుండా చైతన్యం తీసుకొస్తున్నామ న్నారు. ఐసిడిఎస్ సూపర్వైజర్స్ పద్మ, పరమేశ్వరీలు పాల్గొన్నారు.

పిల్లలందరూ ప్రభుత్వ పాఠశాలల్లో చేరేలా ప్రోత్సహించండి

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల: జిల్లాలో బడిఈడు పిల్లలందర్నీ ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి అక్కడే విద్యనభ్యసించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి సంబంధిత అధికారులు, మండల, నియోజకవర్గ స్పెషల్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాలులో ఎంఈఓలు, తహశీల్దార్లు, స్పెషల్ ఆఫీసర్లు, ఐసిడిఎస్ సూపర్వైజర్లు, ఆర్డీఓలతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహి ంచారు. సమావేశంలో ఇంచార్జి జేసీ రామునాయక్, ఆత్మకూరు ఆర్డీఓ అరుణ జ్యోతి, డిఈఓ జనార్ధన్ రెడ్డి, ఐసిడిఎస్ పిడి లీలావతి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 21వ తేది లోపు బడిఈడు పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలలో చేర్చేలా చర్యలు తీసుకో వాలన్నారు. గతంలో జీఓఎంఎస్ 117 ప్రకారం పాఠశాల సర్దుబాటు చేసిన తరుణంలో కొంతమంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాల నుండి ప్రైవేటు పాఠశాలలో చేరడం జరిగిందని, ప్రస్తుత విద్యా సంవత్సరాన్ని దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం సదరు జీఓలో సవరణలు చేస్తూ ప్రజా ప్రతినిధులు, పేరెంట్స్ కమిటీతో చర్చలు జరిపి ఎవ్వరికీ ఇబ్బంది లేకుండా తీర్చిదిద్దడం జరిగిందన్నారు.ఏప్రిల్ 8వ తేది నుండి 22వరకు అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు పోషణ్ పక్వాడ ద్వారా పౌష్టికరమైన ఆహారం అందజేయడం జరుగుతుందన్నారు. వీటి ద్వారా రక్తహీనత, ఎదుగదల లోపం, అనీమియా లేకుండా సంపూర్ణ ఆరోగ్యంగా పిల్లలు ఉండే అవకాశం ఉంటుందన్నారు. మునగాకు తినడం వల్ల రక్తహీనతకు దూరంగా ఉండే అవకాశం ఉంటుందన్నారు.

హజ్ యాత్రికులకు వసతుల కల్పన

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : ఏపీ నుంచి హజ్ యాత్రకు వెళ్లే యాత్రికులు అందరికి ఎంబార్కేషన్ కేంద్రాల వద్ద రాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రత్యేక వసతి సౌకర్యాలు ఏర్పాటు చేయడం జరిగిందని రాష్ట్ర న్యాయ మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ పేర్కొన్నారు. గురువారం నంద్యాలలో నేషనల్ పీజీ కళాశాలలో జిల్లా హజ్ కమిటీ అధ్యక్షుడు, నేషనల్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ ఎస్.ఇంతియాజ్ అహ్మద్ అధ్యక్షతన హజ్ యాత్రికులకు వ్యాక్సినేషన్ కార్యక్రమం జరిగింది. వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రస్తుత ఏడాది రాష్ట్రం నుంచి హజ్ యాత్రకు1630 మంది యాత్రికులు వెళ్తున్నారని, హైదరాబాద్, బెంగళూరు ఎంబార్కేషన్ సెంటర్ల నుంచి వివిధ దశల్లో హజ్ కు బయలుదేరడం జరుగుతుందన్నారు. ఎంబార్కేషన్ కేంద్రాల వద్ద యాత్రికులకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున అన్ని వసతులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. హజ్ యాత్రకు వెళ్లే ప్రయాణికులకు సలహాలు, సూచనలు పూర్తిస్థాయిలో అందిస్తూ పవిత్ర హజ్ యాత్ర దిగ్విజయంగా జరిగేలా నంద్యాల జిల్లా హజ్ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ ఇంతియాజ్ అహ్మద్ చేస్తున్న సేవలు అభినందనీయమని మంత్రి ఫరూక్ పేర్కొన్నారు. మొదటి విడతలో హజ్ కి వెళ్లే ప్రయాణికులకు వ్యాక్సినేషన్ ను మంత్రి ఫరూక్ ప్రారంభించారు. అనంతరం హజ్ యాత్రకు ఉపయోగపడే విధంగా ప్రత్యేకంగా తయారుచేసిన బ్యాగ్ లను మంత్రి చేతుల మీదుగా పంపిణీ చేశారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

విశాలాంధ్ర కర్నూలు
www.visalaandhra.com
కర్నూలు, శుక్రవారం 18, ఏప్రిల్ 2025

అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర – కోడుమూరు: వేసవి కాలం ఎండ వేడి తీవ్రత కారణంగా,అనుకోని సంఘటనలతో అగ్ని ప్రమాదాలు సంభవిస్తాయని ప్రజలందరూ అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక కేంద్రం అధికారి మహబూబ్ దౌలత్ తెలిపారు. అగ్నిమాపక వారోత్సవాలను పురస్కరించుకుని నాల్గవ రోజు గురువారం పట్టణంలోని స్థానిక కర్నూల్ రహదారిలోని హెచ్పి పెట్రోల్ బంక్ వద్ద అగ్ని ప్రమాదాలు జరిగిన సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై పెట్రోల్ బంక్ నిర్వాహకులు, సిబ్బందితో పాటు ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక కేంద్రం అధికారి మహబూబ్ దౌలత్ మాట్లాడుతూ పెట్రోల్ బంకులో పనిచేసే సిబ్బంది వాహనాలకు పెట్రోల్ వేసే సమయంలో సెల్ ఫోన్లు వాడరాదని సూచించారు. పరిసర ప్రాంతాల్లో ఎవ్వరూ పొగ త్రాగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. అనంతరం అగ్నిమాపక కేంద్రం సిబ్బంది అగ్ని ప్రమాదాలను సమస్ఫూర్తితో ఎలా నివారించాలి, అకస్మాత్తుగా అగ్ని ప్రమాదం జరిగి పెద్దఎత్తున మంటలు ఎగసి పడితే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే పలు అంశాలపై డెమో నిర్వహించి పెట్రోల్ బంక్ సిబ్బందికి, ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది కె.సత్యం, ఎం.మారూఫ్, ఎం.శ్రీనివాసులు, టి.రఘు రాముడు, టి.మల్లికార్జున, ఎం.వీరాంజనేయులు, ఎ.మహేశ్వరరెడ్డి, ఒ.దివాకర్ రెడ్డి, బ్రహ్మేశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రగతి కార్డులను 21వ తేదీ నాటికి అందించాలి : జేసీ

విశాలాంధ్ర బ్యూరో – కర్నూలు: జిల్లాలోని విద్యార్థులకు మార్కులతో కూడిన ప్రగతి కార్డులను 21వ తేదీ నాటికి అందించాలని జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం పాఠశాలల ముగింపుకు సంబంధించి వెబెక్స్ ద్వారా సంబంధిత అధికారులతో జాయింట్ కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని విద్యార్థులకు మార్కులతో కూడిన ప్రగతి కార్డులను 21వ తేదీ నాటికి అందించి ఆన్లైన్ నమోదు పూర్తి చేయాలన్నారు. ఉన్నత తరగతులకు చేర్చే ప్రక్రియ పూర్తిచేసి సోమవారం నాడు కొత్త తరగతుల్లో కూర్చునే విధంగా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. పాఠశాల ఆవశ్యకత, విద్యా ప్రమాణాల గురించి విద్యార్థులకు తెలియజేయాలని. ఈ ప్రక్రియ ఒకటి నుండి 10వ తరగతి వరకు అన్ని తరగతులవరకు జరిగేలా చూడాలని జేసీ ఆదేశించారు. జిల్లావ్యాప్తంగా 4,21,632 విద్యార్థులుపై తరగతులకు వెళ్తున్నందున వారందరికీ స్కూలు ప్రత్యేకతలను తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 1886 అంగ న్వాడి కేంద్రాల నుండి పూర్వ ప్రాథమిక విద్యను పూర్తిచేసుకుని ప్రాథమిక విద్యలోకి చేరుతున్నందున వారందరూ మన పాఠశాలల్లో చేరే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.. రాబోయే మూడు రోజులు అనగా 21, 22, 23 తేదీలలో విద్యార్థులు కొత్త తరగతుల్లోకి మారేలా సంబంధిత అన్నీ స్థాయిలలోని విద్యాశాఖాధికారులు కృషి చేయాలన్నారు.. 21 నుండి అందరికీ డేవైస్ షెడ్యూల్ ఇచ్చి ఉన్నందున షెడ్యూల్ ప్రకారం కార్యాచరణలోకి వెళ్లాలన్నారు. పర్యవేక్షణ నిమిత్తం నియమించిన సెక్టోరియల్ అధికారులు ఎప్పటి కప్పుడు పర్యవేక్షించాలన్నారు. ఈ క్రియాశీలక కార్యా చరణ నిమిత్తం జిల్లా, డివిజన్, మండలస్థాయి మానిట రింగ్ కమిటీలు నియమించడం జరిగిందని, ఆయా కమిటీలు విస్తృతంగా పర్యటించి నూటికి నూరు శాతం ఇచ్చిన ఆదేశాలు అమలయ్యేలా, ఆచరణాత్మక కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.శ్యామ్యూల్ పాల్, జిల్లాలోని కాన్స్టిట్యూటెన్సీ లెవెల్ ఆఫీసర్స్, మండల్ స్పెషల్ ఆఫీసర్స్, సిడిపీఓలు, జడ్పీ సీఈఓ కర్నూలు, డిప్యూటీ డిఈఓలు, మండల విద్యాధికారులు క్లస్టర్ ప్రధానోపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలి

విశాలాంధ్ర – హొళగుంద: మండలంలోని రేషన్ కార్డు దారులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని తహశీల్దార్ నిజాముద్దీన్ కోరారు. తన కార్యాలయంలో ఆయన గురువారం మాట్లాడుతూ మండలంలో 57443 మంది ఈ కేవైసీ చేయించుకోవాల్సి ఉండగా 49270 మంది ఈకేవైసీ చేయించుకున్నారని, మిగిలిన 6687 మంది ఈ కేవైసీ చేయించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే 90 శాతం ఈకేవైసీ పూర్తయిందని, మిగిలిన శాతాన్ని కార్డు దారులందరూ పూర్తిచేయాలని అన్నారు. ఈకేవైసీ చేయించుకోవాల్సిన వారు సమీపంలోని ప్రభుత్వ చౌక డిపో అంగాలకు వెళ్లి చేయించుకోవాలని కోరారు.

కేంద్ర మంత్రికి స్వాగతం

విశాలాంధ్ర – కర్నూలు : కర్నూలు జిల్లాలలో రెండు రోజుల పర్యటన నిమిత్తం కర్నూలు ఓర్వకల్లు ఎయిర్పోర్ట్ కు చేరుకున్న కేంద్ర కన్స్యూమర్స్ అఫైర్స్, ఫుడ్, పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్, న్యూ అండ్‌రెన్యువబుల్ ఎనర్జీ మంత్రి ప్రహ్లాద్ జోషి, ప్రహ్లాద్ జోషిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్చాలు అందజేసి స్వాగతం పలికారు. కర్నూలు, నంద్యాల ఎంపీలు బస్తిపాటి నాగరాజు, బైరెడ్డి శబరి, పాణ్యం శాసనసభ్యులు గౌరు చరిత రెడ్డి, మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్, కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్, కర్నూలు ఆర్డీవో సందీప్ కుమార్, గ్రీన్ కో ప్రాజెక్ట్ ప్రతినిధులు, ఓర్వకల్లు మండలం తహశీల్దార్‌లు ఉన్నారు.

నేడే ఉచిత వైద్య పరీక్షల శిబిరం

విశాలాంధ్ర – ఆదోని రూరల్: జంగమ అర్చక సమాఖ్య, శ్రీఅల్కూరు మఠం మహర్షి సిద్దయ్య స్వామి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నేడే ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు జంగమ అర్చక సమాఖ్య సంఘము డివిజన్ అధ్యక్షుడు అల్కూరిమఠం మహర్షి విజయ్ కుమార్ స్వామి తెలిపారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గుండె, ఈసీజీ, 2డీ ఎకో ఎస్సార్ ఎముకలు, చెవి, ముక్కు, గొంతు, కిడ్నీ, బీపీ షుగర్ వంటి పలు రకాల వైద్య పరీక్షలు కర్నూలు కిమ్స్ హాస్పిటల్ వైద్యుల దాతృత్వంతో ఉచితంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. తిరుమల నగర్ కాలనీలో ఉన్న శ్రీమల్లికార్జున ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఉదయం 10 గంటల నుంచి వైద్య సేవలు ప్రారంభమవుతాయని తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైద్య పరీక్షలు మాత్రమే ఉచితంగా నిర్వహించడం జరుగుతుందని, మందులు ఉచితంగా ఇవ్వడం జరుగదని, ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని విజ్ఞప్తి చేశారు.

ఉచిత ప్రవేశాలకు దరఖాస్తు

విశాలాంధ్ర – కర్నూలు ఎడ్యుకేషన్: బాల బాలికల నిర్బంధన ఉచిత విద్య హక్కు చట్టం 12 (1) సీ మేరకు 2025- 26 విద్యా సంవత్సరానికి జిల్లాలోని ప్రైవేటు పాఠశాలలో ప్రవేశాలు చేపట్టాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2025 26 విద్యాసంవత్సరాలను నిరుపేద కుటుంబాల పిల్లలను ప్రైవేటు పాఠశాలలో ఒకటో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్. సామ్యూల్ పాల్ గురువారం తెలిపారు. ప్రైవేటు పాఠశాలలో 25 శాతం సీట్లను నిరుపేద కుటుంబాల పిల్లలకు కేటాయించిన విషయం తెలిసిందే. వచ్చే విద్యా సంవత్సరానికి ఉచిత విద్యను అందించే జిల్లాల్లోని అన్ని ప్రైవేటు పాఠశాలలో ఈ నెల 19 నుంచి 26 వరకు తమ వివరాలను విద్యాశాఖ లో పొందుపర్చాలని తెలిపారు. దరఖాస్తు సమర్పించవలసిన వెబ్‌సైట్ htto://case.ap.gov.in, పూర్తి సమాచారం కోసం 1800425899 టోల్ ఫ్రీ నెంబరును సంప్రదించవచ్చని వారు తెలిపారు.

నిర్మాణంలో ఉన్న పనులు తనిఖీ

విశాలాంధ్ర – సి.బెళగల్ : మండల కేంద్రంలో మండల పరిషత్ కార్యాలయం ముందు ప్రభుత్వ నిధులు వెచ్చించి, నిర్మాణం చేపడుతున్న దుకాణ సముదాయమును, వాటి పనులను కోడుమూరు డివిజన్ డీఈ కర్రెన్న తనిఖీ చేశారు.గురువారం బెళగల్ మండల పరిషత్ కార్యాలయంలో అసిస్టెంట్ ఇంజినీర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలో ఎక్కడైనా ప్రభుత్వ భవనాలు, సీసీ రోడ్లు, డ్రైనేజి ఇతర పనుల నిర్మాణాలలో నాణ్యతగా చేపట్టాలని ఆయన సూచించారు. మండల స్థాయి అధికారుల సలహాలు పాటించాలని తెలిపి, అనంతరం దుకాణ సముదాయం పనులను పంచాయతీరాజ్ ఏఈ వెంకట ప్రకాష్‌తో కలిసి నిర్మాణ పనులను పరిశీలించారు.

గోరంట్లలో రీసర్వేపై గ్రామసభ

విశాలాంధ్ర – కోడుమూరు : మండలంలోని గోరంట్ల గ్రామంలో రీ-సర్వే గురించి ర్యాలీ నిర్వహించి, గ్రామ సభల్లో అధికారులు గ్రామంలోని రైతులందరికీ రీసర్వేపై అవగాహన కల్పించారు. గురువారం గోరంట్ల గ్రామ సచివాలయం వద్ద గ్రామ సర్పంచ్ బాలకృష్ణ అధ్యక్షతన, తహశీల్దార్ డి.వెంకటేష్ నాయక్ ఆధ్వర్యంలో రీ-సర్వే గురించి గ్రామ సభ నిర్వహించారు. తహశీల్దార్ మాట్లా డుతూ గ్రామంలోని పట్టా భూములు హక్కుదారులు మ్యుటే షన్ ప్రక్రియ ద్వారా ఆన్లైన్ నందు తమరు పేర్లను నమోదు చేసు కోగలరని సూచించారు. రైతుల సమక్షంలోనే రీసర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. రీ-సర్వే డిప్యూటీ తహశీల్దార్, మండల సర్వేయర్ సునీల్, గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

డీఎండీఓ ప్రమోషన్ పట్ల హర్షం

విశాలాంధ్ర–హొళగుంద: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్, బిజెపి రాష్ట్ర నాయకురాలు పురందేశ్వరి ఆదేశాలతో గ్రామీణ విస్తరణ అధికారులను డిప్యూఎండివోలుగా ప్రమోషన్ ఉత్తర్వులు ఇవ్వడం పట్ల నూతన డిప్యూటీ ఎంపీడీవో పిఎంఎం చక్రవర్తి హర్షం వ్యక్తం చేశారు. ఎండిఓ కార్యాలయంలో గురువారం నూతన డిఎండిఓ పిఎంఎం చక్రవర్తి మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ప్రమోషన్‌కు నోచుకోకపోయినా, ఈఓ ఆర్డీలను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి డిఎండివోలుగా ప్రమోషన్ ఇవ్వడం ఎంతో ఆనందాన్ని ఇచ్చిందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన గుర్తింపుతో గ్రామీణ అభివృద్ధి పనులు రెట్టింపు ఉస్తాహంతో చేపడుతామని అన్నారు. కేవలం గ్రామీణ ప్రాంతాల వరకే గుర్తింపు ఉన్న ఈవోఆర్డిలను మండల స్థాయిగా గుర్తించడం శుభపరిణామమన్నారు.

రైతులకు అండగా కూటమి ప్రభుత్వం

విశాలాంధ్ర–హొళగుంద: రైతులకు కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడు అండగా ఉంటుందని మండల టిడిపి కన్వీనర్ డాక్టర్ తిప్పయ్య అన్నారు. రైతు సేవ కేంద్రంలో గురువారం 12 మంది రైతులకు సబ్సిడీ ద్వారా అందించే వ్యవసాయ స్ప్రేయర్లను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను విడతలవారీగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నెరవేరుస్తున్నారని అన్నారు. రైతులకు సబ్సిడీ పరికరాలు, ట్రాక్టర్లు, విత్తనాలు, కనీసం మద్దతు ధరలు ఇచ్చి రైతు కుటుంబాలను కూటమి ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాధికారి ఆనంద్ లోక్‌దళ్, ఏఈ విరుపాక్షి, ఏఏఓలు మణిశ్రీ, భారతి భాయి, నంసింహులు, ఉత్తర కుమార్, రమణ నాయక్, రాజు నాయక్, మణి, సాయి కృష్ణ, పవన్, యూసుఫ్, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

కస్తూర్బా విద్యార్థినిలకు అవగాహన సదస్సు

విశాలాంధ్ర – నందవరం: నేటి సమాజంలో బాలికలపై జరుగుతున్న అఘాయిత్యాలపై నందవరం కస్తూరిబా గాంధీ విద్యాలయంలో బాలికలకు అవగాహన సదస్సును ఎస్సై ఎం.కేశవ ఏర్పాటు చేశారు. ఎస్ఐ మాట్లాడుతూ సైబర్ క్రైమ్, బాల్యవివాహాలు, శక్తి టీమ్ యాప్, గుడ్ టచ్ - బ్యాడ్ టచ్ గురించి అవగాహన కల్పించారు. బాలికల భద్రతకు సంబంధించి ఎలాంటి సమస్యలున్న తనను నేరుగా సంప్రదించొచ్చన్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

హజ్ కమిటీ సభ్యుడిగా సూరి మన్సూర్ అలీఖాన్

విశాలాంధ్ర బ్యూరో – కర్నూలు: రాష్ట్ర ప్రభుత్వం నియమించిన హజ్ కమిటీలో టీడీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ సూరి మన్సూర్ అలీ ఖాన్‌కు చోటు దక్కింది. సేవా కార్యక్రమాలు చేస్తున్న ఆయన్ను సామాజిక కార్యకర్తల విభాగం కింద హజ్ కమిటీ సభ్యుడిగా నియమిస్తూ రాష్ట్ర మైనా రిటీ సంక్షేమ శాఖ కార్యదర్శి శ్రీధర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కమిటీ పదవీ కాలం మూడేళ్లు ఉంటుంది. హజ్ కమిటీ సభ్యుడిగా తనను నియమించిన సీఎం చంద్రబాబు నాయుడుకు, సేవా కార్యక్రమాలు చేయాలని ప్రోత్సహించిన రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్‌కు ఆయన ధన్య వాదాలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానన్నారు. ప్రజలకు సేవ చేసేందుకు ఎప్పుడూ ముందుంటానని ఆయన చెప్పారు.

మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన ఇంచార్జ్

విశాలాంధ్ర – నందవరం: మాచాపురం గ్రామానికి చెందిన జనసేన సానుభూతి పరుడు నరసింహా రెడ్డి తండ్రి హనుమంతు రెడ్డి గత నెలలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మిగనూరు జనసేన ఇన్ ఛార్జ్ రేఖ గౌడ్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కుటుంబ పెద్దను కోల్పోవడం బాధాకరమైన విషయమని, ఆ కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని, పార్టీ తరపున కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని తెలిపారు. అనంతరం మృతుడి చిత్ర పటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆమె వెంట మండల జనసేన అధ్యక్షులు ఎల్లప్ప, జనసేన నాయకులు ప్రతాపరెడ్డి పాల్గొన్నారు.

పోగొట్టుకున్న చీరల బ్యాగు అప్పగింత

విశాలాంధ్ర – బ్యూరో కర్నూలు : ఆటోలో పోగొట్టుకున్న చీరల బ్యాగును వెతికించి బాధితుడికి కమాండ్ కంట్రోల్ పోలీసులు గురువారం అందించారు. తమిళనాడు, మధురై దగ్గర శంకర్కోయిల్ గ్రామంకు చెందిన చీరల వ్యాపారస్తుడు జగదీష్, కర్నూలు మౌర్య ఇన్ దగ్గర ఆటో ఎక్కి చందన బ్రదర్స్, ద్రైస్ సర్కిల్ దగ్గర ఆటో దిగాడు.రూ.12 వేల విలువ చేసే చీరల బ్యాగును ఆటోలో మర్చిపోయాడు. అతను కర్నూలు రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు ఇటీవలకొత్తగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ద్వారా కమాండ్ కంట్రోల్ సిఐ శివశంకర్ ఆధ్వర్యంలో కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఉన్న ఏఎస్ఐ అస్లాం, హెడ్ కానిస్టేబుల్ రమేష్ రాయల్ సీసీ కెమెరాల ద్వారా సీసీ ఫుటేజ్ పరిశీలించారు. ఆటోని గుర్తించారు. ఆటో టాప్ నెంబర్ తెలుసుకొని ఆటో డ్రైవర్ రషీద్‌ను పిలిపించి, చీరల బ్యాగును బాధితుడికి అందజేశారు.

స్వయం ఉపాధి షాపులు ప్రారంభం

విశాలాంధ్ర – ఓర్వకల్లు: మండలంలోని నన్నూరు గ్రామంలో ప్రధాన మంత్రి అనసూచిత్ జాతి అభ్యుదయ యోజన ఎస్సి కార్పొరేషన్ సబ్సిడీ, ఉన్నతి వడ్డీలేని రుణం ఎస్ఈఅర్‌పితో జీవనోపాదుల కల్పన ద్వారా పూజ ఎస్‌హెచ్‌జి లోని గుర్రం శ్రీవాణికి శారీస్ సెంటం అండ్ జీరాక్స్ సెంటర్‌కు, కవిత ఎస్‌హెచ్‌జిలోని రామలక్ష్మికి కూల్ డ్రింక్ షాప్ యూనిట్ విలువ లక్ష రూపాయలకు రెండు షాప్ లకు ఇవ్వడం జరిగింది. వెలుగు సీసీ సూరిబాబు, టీడీపీ మైనారిటీ నాయకులు ఖాజామియ్య, మండల మాజీ కోఆప్షన్ మెంబెర్ షాంశుద్దీన్, వీఓఏ మద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే మృతి పార్టీకి తీరని లోటు

విశాలాంధ్ర –చిప్పగిరి: ఆలూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే లోకనాథ్ మరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని ఆలూరు కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జ్ చిప్పగిరి లక్ష్మీనారాయణ అన్నారు. మొలగవెళ్లి గ్రామంలో లోకనాథ్ పార్థివదేహానికి ఘన నివాళులు అర్పించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ తరపున వారి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మిగనూరు ఇంఛార్జ్ ఖాశీంవలి, ఆలూరు మండల అధ్యక్షులు పూల రామాంజనేయులు, చిప్పగిరి మండల ఉపాధ్యక్షులు కరెంటు గోవిందు, వినోద్ కుమార్ మరియు వెంకటేష్ పాల్గొన్నారు.

హెల్మెట్ అవగాహన ర్యాలీని

విశాలాంధ్ర బ్యూరో – కర్నూలు : ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు, రహదారి భద్రత నిబంధనలపై పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని, ప్రజలు ట్రాఫిక్ రూల్స్ పాటించి పోలీసులకు సహకరించాలని కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. గురువారం కర్నూలు ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన హెల్మెట్ అవగాహన ర్యాలీ, అధునాతన ట్రాఫిక్ నియంత్రణ పరికరాలను కర్నూలు స్థానిక కొండారెడ్డి బురుజు వద్ద జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా విలేకరులతో జిల్లా ఎస్పీ మాట్లాడుతూ సామాజిక భాద్యత కలిగిన దాతల సహకారంతో ట్రాఫిక్ నియంత్రణకు కర్నూలు మెడికవర్ హాస్పిటల్ 35 బారికేడ్స్, మైపర్ ఫార్మసి కళాశాల 10 బారికేడ్స్, కెనరా బ్యాంక్ 5 బారికేడ్స్ మొత్తం 50 అధునాతన బారికేడ్స్‌ను అందజేశారన్నారు. రాంగ్ రూట్‌లలో వెళ్ళకూడదన్నారు. ఫుట్‌పాత్ ఆక్రమణలకు పాల్పడకూడదన్నారు.

రాజకీయ శిక్షణ తరగతులు జయప్రదం చేయండి

విశాలాంధ్ర – ఎమ్మిగనూరు: ఈనెల 26 27,28 కడప జిల్లాలో జరుగుతున్న ఏఐఎస్ఎఫ్ రాష్ట్రస్థాయి విద్య వైజ్ఞానిక రాజకీయా శిక్షణ తరగతులు జయప్రదం చేయాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు కోరారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో శిక్షణ తరగతుల కరపత్రాలను విడుదల చేశారు. ఏఐఎస్ఎఫ్ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు విష్ణు, ఖాదర్ తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దాదాపు సంవత్సర కావస్తున్న ఇప్పటివరకు ఎన్నికల్లో ఇచ్చినటువంటి తల్లికి వందనం కింద విద్యార్థులకు రూ.15 వేలు ఇవ్వకుండా విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేయడం జరిగిందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు నదీమ్, అంజి బాబు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పర్మనెంట్ డీలర్లను నియమించాలి

విశాలాంధ్ర–పెద్దకడబూరు: మండల పరిధిలోని కల్లుకుంట గ్రామంలో పర్మినెంట్ రేషన్ డీలర్లను నియమించాలంటూ గురువారం ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో తహసీల్దార్ గీతా ప్రియదర్శినికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ తాలూకా అధ్యక్షులు జాఫర్ పటేల్, మండల కార్యదర్శి షేక్షావలి మాట్లాడుతూ రేషన్ డీలర్లు బియ్యం పంపిణీ చేయడంలో విఫలం చెందారని ఆరోపించారు. కార్డు లబ్దిదారులకు రేషన్‌ను సక్రమంగా వేయడం లేదని, తమ కోటకు సంబంధించిన బియ్యం అడిగితే స్టాక్ లేవంటూ రాత్రి పూట బ్లాక్ మార్కెట్‌కు తరలించి, అక్రమంగా సొమ్ము చేసుకుంటున్నారని విమర్శించారు. అధికారులు స్పందించి డీలర్లపై చర్యలు తీసుకొని, పర్మినెంట్ డీలర్లను నియమించాలని డిమాండ్ చేశారు.

ఘనంగా భంభం స్వామి ఉరుసు

విశాలాంధ్ర–చిప్పగిరి: చిప్పగిరిలోని భంభం స్వామి ఉరుసు మహోత్సవాలను కనుల పండుగ నిర్వహించారు. గురువారం డాక్టర్ సయ్యద్ ఆరివుద్దీన్ హమ్స్ ఖాద్రి ఆధ్వర్యంలో ఉరుసు షంషీరును అశ్వంపై ఉంచి గ్రామ పూరవీధుల గుండా ఊరేగించారు. దర్గా స్థలదాత గొల్ల రంగప్ప ఇంటి వరకు షంషీర్ ఉత్సవం కొనసాగించారు. మార్గమధ్యంలో వేలాదిమంది భక్తులు పాల్గొని షంషీర్ ఉత్సవాన్ని తిలకించారు. సలాములు ఫాతిహా జరిపి చదివింపులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గోవిందరాజులు, ఎంపిటిసి సభ్యురాలు ఎల్లంకి రజిని, ఇతర ప్రాంతాల నుండి వచ్చిన భక్తాదులు పాల్గొన్నారు. దర్గా ఆవరణలో కొట్టం నారాయణస్వామి ఆధ్వర్యంలో సాంస్కృతి క కార్యక్రమాలను నిర్వహించారు. పూల హారాలు వేసి స్వామిని దర్శించుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వేలాది మంది భక్తులు భం భం బాబా దర్గాలో ముక్కులు తీర్చుకున్నారు.

అరచేతిలో నగరపాలక సేవలు

విశాలాంధ్ర – కర్నూలు సిటీ : నగర పౌరులు అరచేతిలో నగరపాలక సేవలు పొందవచ్చని నగరపాలక అదనపు కమిషనర్ ఆర్జీవి కృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నగరాలు, పట్టణాల ప్రజల సౌకర్యార్థం, స్థానిక సమస్యలకు సులువుగా పరిష్కారం పొందేందుకు వీలుగా పురమిత్ర యాప్‌ను రూపొందించిందని, నగరపాలకకు సంబంధించిన సమస్త సేవలను కార్యాలయానికి వెళ్ళాల్సిన అవసరం లేకుండా, సులువుగా 'పురమిత్ర'లోనే సకల సేవలు పొందవచ్చని పేర్కొన్నారు. తాగునీరు, పారిశుద్ధ్యం, వీధి దీపాలు, ఇళ్లలో చెత్త సేకరణ, ఇంటి పన్ను చెల్లింపు, భవన నిర్మాణ అనుమతులు, ఆక్రమణలు, ప్రజారోగ్యం, దోమలు, కుక్కల బెడద, రహదారులపై గుంతలు, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, కుళాయిల ఏర్పాటు, పేదరిక నిర్మూలన, వంటి 119 రకాల సేవలు పురసేవ యాప్‌లో అందుతాయని వెల్లడించారు. దీనిని ప్లే స్టోర్ లేదా యాప్ స్టోర్ నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. టైప్ చేసి లేదా లేదా వాయిస్ రూపంలోనూ పంపేందుకు అవకాశం ఉందని, సమస్యను ఫోటో తీస్తే ఆటోమెటిగ్గా ఏఐ ద్వారా సంబంధిత చిరునామా అధికారులకు వస్తుందని వెల్లడించారు. నగరంలో ఇప్పటికి 50 వేల మంది పౌరులు పురమిత్ర యాప్‌ను డౌన్లోడ్ చేసుకున్నారని, మిగిలిన పౌరులు సైతం డౌన్లోడ్ చేసుకోవాలని అదనపు కమిషనర్ ఆర్జీవి కృష్ణ సూచించారు.

పక్వాడపై అవగాహన కలిగి ఉండాలి

విశాలాంధ్ర – ఆదోని రూరల్: గర్భిణీలు, బాలింతలు పోషన్ పక్వాడపై అవగాహన కలిగి ఉండాలని సూపర్వైజర్ స్వయం ప్రభ సూచించారు. గురు వారం పట్టణంలోని ఎల్పీ ఎస్టేట్ సెంటర్ 114 అంగన్వాడి కేంద్రం నందు సిడిపిఓ ఉమా మహేశ్వరి ఆదేశాల మేరకు అవగాహన ర్యాలీ కార్యక్రమన్ని నిర్వహించారు. వార్డులోని మహిళలకు, గర్భిణులకు, బాలింతలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పౌష్టికాహారం గురించి అవగాహన కల్పించి, పలు సూచనలు ఇచ్చారు. గర్భం దాల్చిన రోజు నుండి పిల్లలు రెండేళ్ల వయసు వచ్చేవరకు సంపూర్ణ పోషక ఆహారాలు అందిస్తే వాటి వల్ల పిల్లల భవిష్యత్తు ఎదుగుదల ఆధారపడి ఉంటుందన్నారు. మహిళా పోలీస్ దివ్య, అంగన్వాడి టీచర్లు శారద, ఈరమ్మ,నాగరత్న హెల్పర్స్ లక్ష్మి,కీర్తి,తయమ్మ పాల్గున్నారు.

శ్రీ మల్లికార్జునస్వామి దేవాలయం భూములు పరిశీలన

విశాలాంధ్ర–పెద్దకడబూరు: పెద్ద కడబూరు గ్రామంలో వెలసిన శ్రీ మల్లికార్జున స్వామి దేవాలయం భూములను విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఆలయ పెద్దలు గురువారం పరిశీలించారు. ఆలయ పెద్దలు నరవ రమాకాంత రెడ్డి, నరవ విరుపాక్షి రెడ్డి మరికొంత మంది దేవాలయానికి సంబంధించిన భూములు, వాటి హద్దులను పరిశీలించారు. స్వామి వారి భూములను కాపాడడం ఆలయ పెద్దలు, భక్తుల భాధ్యత అని వారు వెల్లడించారు. ఈ పరిశీలనలో మల్లికార్జున, గ్రామస్తులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతో అన్ని వర్గాలకు సమన్యాయం : ఎమ్మెల్యే

విశాలాంధ్ర– పత్తికొండ: కూటమి ప్రభుత్వంతోనే అన్ని వర్గాలకు సమ న్యాయం చేకూరుతుందని, ఎమ్మెల్యే కేఈ శ్యాం బాబు అన్నారు. గురువారం ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ముత్యాల తిరుపాలతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ పోరాటం మొదలైన రోజే వర్గీకరణకు తనవంతు సహకారం అందిస్తానని చంద్రబాబు హామీ ఇచ్చారని, ఇచ్చిన మాట ప్రకారం ఈరోజు వర్గీకరణ ఆయన హయంలోనే చేశారన్నారు. గత వైసిపి హయాంలో రాష్ట్రం అన్ని రకాలుగా వెనుకబాటుకు గురైందని రేషన్, గుంతలు పడ్డ రోడ్లకు గంపెడు మట్టి కూడా వేయని దుస్థితిలో పాలన సాగిందని, చంద్రబాబుతోనే అభివృద్ధి సాధ్యమని ప్రజలు టిడిపికి పట్టం కట్టారున్నారు. అధికారంలోకి రాగానే చంద్రబాబు కోట్ల రూపాయలు వెచ్చించి రహదారులు మరమ్మతులు చేశారని. గ్రామ గ్రామాన సిసి రహదారులు ఏర్పాటు చేశారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పింఛన్ల పెంపుదల ఉచిత గ్యాస్ సిలిండర్ లో అందించారన్నారు. రానున్న రోజుల్లో చంద్రబాబు పాలనలో రాష్ట్రం దేశంలోనే అభివృద్ధిలో మొదటి స్థానంలో నిలుస్తుంది అన్నారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు రామానాయుడు. ఎస్సీ సెల్ నాయకులు బోనాల కాశి హెూసూరు అంజి, ఉచ్చిరప్ప కడవల సుధాకర్, రాంపల్లి తిరుపాలు, హెూటల్ సుధా, శ్రీనివాసులు గౌడ్, జగ్గిలి రాజేష్ పాల్గొన్నారు.

వైసీపీని వీడే ప్రసక్తే లేదు : మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్

విశాలాంధ్ర – ఆదోని : తాను ఏ రోజు పదవి కోసం పాకులాడలేదని ప్రజల కోసం పనిచేయాలని వచ్చానని తనకు చైర్మన్ పదవి లేకున్న కౌన్సిలర్ పదవి తోనే ప్రజలకు సేవ చేస్తానని, వైసీపీ పార్టీని వీడే ప్రసక్తే లేదని, తనకు జరిగిన అన్యాయంపై భవిష్యత్తులో మాట్లాడుతానని, అన్ని విషయాలు చెబుతానని ఆదోని మున్సిపల్ తాజా మాజీ చైర్పర్సన్ బోయ శాంత స్పష్టం చేశారు. గురువారం తన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ తనకు చైర్మన్గ కొనసాగేందుకు గత నాలుగు సంవత్సరాల ఒక నెలరోజుల పాటు కొనసాగేందుకు ఎంపిక చేసిన మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి, తనకు సహకరించిన మున్సిపల్ కౌన్సిలర్లకు సహకరించని కౌన్సిలర్లకు కృతజ్ఞతలు తెలిపారు. మున్సిపల్ అధికారులకు మున్సిపల్ సిబ్బందికి పత్రిక విలేకరులకు కృతజ్ఞతలు తెలియజేశారు. తనను ఈ పదవిలో ఉండేందుకు గెలిపించిన పట్టణ ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కొత్తగా వస్తున్న చైర్మన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. చైర్పర్సన్ బలపరీక్షకు ఎందుకు హాజరు కాలేదని ప్రశ్నిస్తే ఇక తన పని ఏముందని వెళ్లలేదని స్పష్టం చేశారు. వైసీపీలో గెలుపొంది విప్ ధిక్కరించిన విషయాన్ని ప్రస్తా వించగా కౌన్సిలర్ తనకు వద్దు అని అధిష్టానం నిర్ణయిస్తే ఇంట్లో ఉంటానని, పార్టీ మారనన్నారు. భవిష్యత్తులో ఏ పార్టీ నుంచి పోటీ చేస్తారని ప్రశ్నిస్తే అప్పుడు చూద్దామని తెలిపారు. మీకు అండగా ఎమ్మెల్యే పార్థసారథి ప్రెస్ మీట్ ఇచ్చారని వివరిస్తే అది వారి ఇష్టమని, తనకు తెలియదని సమాధానం దాటవేశారు.

కార్మికులకు పెండింగ్‌లో ఉన్న యూనిఫామ్‌ను ఇవ్వాలి

విశాలాంధ్ర – ఎమ్మిగనూరు: పారిశుద్ధ్య కార్మికులకు పెండింగ్‌లో ఉన్న యూనిఫామ్‌ను ఇవ్వాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. ఎమ్మిగనూర్ మున్సిపల్ పరిధిలో పనిచేస్తున్న రెగ్యులర్ పని చేస్తున్న పారిశుద్ధ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న తొమ్మిదేళ్ల కుట్టు కూలీలు, రెండు సంవత్సరాలుగా యూనిఫార్మ్, కొబ్బరినూనె సబ్బులు, చెప్పులు వెంటనే కార్మికులకు కోరుతూ గురువారం రోజున ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో మున్సిపల్ మేనేజర్ వినతి పత్రం సమర్పించారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు బి.ఎల్లప్ప, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ తాలూకా ఉపాధ్యక్షుడు శివకృష్ణ, తాలూకా కార్యదర్శి తిమ్మ గురుడులు మాట్లాడుతూ ఏండ్లు తరబడి పారిశుద్ధ్య కార్మికుల ఇవ్వాల్సిన వాటిని ఇవ్వకుండా మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. బట్టల కుట్టిన కూలిని కూడా ఇవ్వకుండా తొమ్మిది సంవత్సరాల నుండి కార్మికులను మోసం చేస్తున్నారని, తక్షణమే కొబ్బరి నూనె, సబ్బులు, యూనిఫామ్స్ ఇచ్చి కార్మికుల ఆదుకోవా లన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శి నరసింహ, విజేంద్ర, పారిశుద్ధ కార్మికులు సుందర్ రాజ్, కె.కుమార్, రోగన్నా, మారెప్ప, నబీరసూల్, టి.లక్ష్మి పాల్గొన్నారు.

విశాలాంధ్ర కర్నూలు/నంద్యాల
www.visalaandra.com
కర్నూలు, శుక్రవారం 18, ఏప్రిల్ 2025

కరిగిపోతున్న కొండలు

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల: గ్రావెల్ తవ్వకాలతో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. చిట్టడుగులు పచ్చదనంతో కళకళలాడాల్సిన కొండలు కనుమరు గవుతున్నాయి. యదేచ్ఛగా సాగుతున్న అక్రమ గ్రావెల్ తవ్వకాలతో కొండలు అదృశ్యం అవుతున్నాయి. గతంలో ఎన్నడు లేని విధంగా అక్రమార్కులు రెచ్చి పోతున్న సంబంధిత అధికా రులు కన్నెత్తి చూడడం లేదు. పవర్ గ్రిడ్ నిర్మాణానికి గ్రావెల్ తరలింపుతో అక్రమార్కులు జేబులు నింపుకొం టుండగా సహజ సిద్ధమైన ప్రకృతి నాశనం అవుతున్నది. అక్రమ తవ్వకాలతో భారీ గుంతలు ఏర్పడి కుంటలు, చిన్నపాటి చెరువులను తలపిస్తున్నాయి. మండలంలోని ఎస్ చెన్నంపల్లి, తిమ్మనాయుని పేట గ్రామాల మధ్య మండలంలోని అతిపెద్ద తిమ్మనాయునిపేట చెరువు పక్కన గత కొన్ని నెలలుగా అక్రమార్కులు రెచ్చిపోతూ గ్రావెల్ తవ్వకాలు సాగిస్తున్నారు. భారీ ఎత్తున తవ్వకాలు జరుగు తున్న సంబంధిత అధికారులు అటువైపు కన్నీటి చూడడం లేదు. రేయింబవళ్లు ప్రొక్లైన్లతో తవ్వకాలు చేస్తూ టిప్పర్ల ద్వారా గ్రావెల్ ను పవర్ గ్రిడ్‌కు తరలిస్తున్నారు. తవ్వకాలతో పచ్చదనం కను మరుగు కావడంతో వన్యప్రాణులు కూడా అదృశ్యం అవుతున్నాయి. ఒకవైపు ప్రభుత్వం చెట్లను నాటి పచ్చదనం పెంచాలని, ఉన్న చిన్నపాటి చిట్టడుగులను కాపాడుకోవాలని విశ్వ ప్రయ త్నం చేస్తుంటే మరోవైపు మాత్రం అక్రమా ర్కులు ఆడిందే ఆటగా పాడిందే పాటగా సాగుతు న్నది. ప్రభుత్వం నిజంగానే ఇంత పెద్ద ఎత్తున తవ్వకాలకు అనుమతి ఇచ్చిందా అన్నది కూడా ప్రజల్లో పలు అనుమానాలను రేకెత్తిస్తున్నది. మండలంలో ఎక్కడో చిన్నపాటి తవ్వకాలు జరిపితేనే రెక్కలు కట్టుకొని వాలిపోయే రెవెన్యూ అధికారులు ఇంత తతంగం జరుగుతున్న మౌనం దాల్చడం వెనుక అను మానాలకు దారితీస్తున్నది. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి చిట్టడుగులను ప్రకృతి సంపదను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర - కోడుమూరు: వేసవి కాలం ఎండ వేడి తీవ్రత కారణంగా,అనుకోని సంఘటనలతో అగ్ని ప్రమాదాలు సంభవిస్తాయని ప్రజలందరూ అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక కేంద్రం అధికారి మహబూబ్ దౌలత్ తెలిపారు. అగ్నిమాపక వారోత్సవాలను పురస్కరించుకుని నాల్గవ రోజు గురువారం పట్టణంలోని స్థానిక కర్నూల్ రహదారిలోని హెచ్పి పెట్రోల్ బంక్ వద్ద అగ్ని ప్రమాదాలు జరిగిన సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై పెట్రోల్ బంక్ నిర్వాహకులు, సిబ్బందితో పాటు ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక కేంద్రం అధికారి మహబూబ్ దౌలత్ మాట్లాడుతూ పెట్రోల్ బంకులో పనిచేసే సిబ్బంది వాహనాలకు పెట్రోల్ వేసే సమయంలో సెల్ ఫోన్లు వాడరాదని సూచించారు. పరిసర ప్రాంతాల్లో ఎవ్వరూ పొగ త్రాగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. అనంతరం అగ్నిమాపక కేంద్రం సిబ్బంది అగ్ని ప్రమాదాలను సమస్ఫూర్తితో ఎలా నివారించాలి, అకస్మాత్తుగా అగ్ని ప్రమాదం జరిగి పెద్దఎత్తున మంటలు ఎగసి పడితే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే పలు అంశాలపై డెమో నిర్వహించి పెట్రోల్ బంక్ సిబ్బందికి, ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది కె.సత్యం, ఎం.మారూఫ్, ఎం.శ్రీనివాసులు, టి.రఘు రాముడు, టి.మల్లికార్జున, ఎం.వీరాంజనేయులు, ఎ.మహేశ్వరరెడ్డి, ఒ.దివాకర్ రెడ్డి, బ్రహ్మేశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

19న నంద్యాల జిల్లా స్థాయి చెస్ పోటీలు

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : ఆంధ్ర చెస్ అసోసియేషన్ నిర్వహించబోయే రాష్ట్రస్థాయి చెస్ పోటీలలో పాల్గొనే జిల్లా జట్ల ఎంపిక కోసం నంద్యాల జిల్లా చెస్ సంఘం ఆధ్వర్యంలో శనివారం మధ్యాహ్నం 3 గంటలకు నేరవాటి ఇంగ్లీష్ మీడియం స్కూల్లో జిల్లా స్థాయి 7, 9 ఏళ్లలోపు బాల, బాలికలకు వేరు వేరు విభాగాలలో చెస్ పోటీలు నిర్వ హించడం జరుగుతుందని చెస్ సంఘ అధ్యక్షులు డాక్టర్ జి.రవికృష్ణ, కార్యదర్శి జి.రామసుబ్బారెడ్డి తెలిపారు. ఈ నెల 18వ తేదీ సాయంత్రం 6 గంటల్లోపు ఏపీ చెస్ వెబ్ సైట్‌లో ఎంట్రీలు నమోదు చేసుకోవాలని, ఇతర వివరాలకు నెంబర్ 9010451585ను సంప్రదించాలన్నారు.

వ్యాపార దృక్పథం పెంచే పద్ధతులపై అవగాహన

విశాలాంధ్ర -పాణ్యం: శాంతిరాం ఇంజినీరింగ్ కళాశాల, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల కోసం ప్రత్యేక అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా ఉపాధ్యాయులు స్టార్టప్, ఆవిష్కరణల ప్రాధాన్యత, విద్యార్థులలో వ్యాపార దృక్పథం పెంపొందించే పద్ధతులపై అవగాహన పొందారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతికు చెందిన ప్రఖ్యాత విద్యావేత్త ప్రొఫెసర్ డా.టి.రమశ్రీ విచ్చేసి ముఖ్య అభ్యాసాన్ని నిర్వ హించారు. ఆమె మాట్లాడుతూ నేటి విద్యార్థులు ఉద్యోగాల కోసం ఎదురు చూసే వారు కాకుండా, ఉద్యోగాలను సృష్టించే నాయకులుగా ఎదగాలి. ఉపాధ్యాయులు ఈ మార్పుకు మార్గదర్శకులవ్వాలి అని చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎం.వి. సుబ్రమణ్యం మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు ఉపాధ్యాయుల ఆలోచనా ధోరణిలో మార్పు తీసుకువచ్చి,విద్యార్థులలో ఆవిష్కరణలు, పరిశోధన, స్టార్టప్ భావనలకు మార్గం చూపుతాయన్నారు. ఈ కార్యక్రమాన్ని డా.వై.మల్లికార్జునరావు విభాగాధిపతి, ప్రోగ్రాం కోఆర్డినేటర్ ప్రొఫెసర్ నాగమణి సమర్థవంతంగా నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యా యులు చురుకుగా పాల్గొని తమ అభిప్రాయాలను వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమం ఉపాధ్యాయుల్లోని విద్యా అభ్యాసాన్ని నూతన దిశగా మార్చి, విద్యార్థుల భవిష్యత్తుకు మార్గదర్శిగా నిలిచింది.

కార్యకర్తే పార్టీకి పునాది

విశాలాంధ్ర - ఆత్మకూరు టౌన్: పార్టీకి కార్యకర్తలే పునాది అని శ్రీశైలం నియో జకవర్గం ఎమ్మెల్యే రాజ శేఖర రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మండపంలో శ్రీశైలం నియోజకవర్గం టీడీపీ విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తల పనితీరు ఆధారంగానే పార్టీ పదవులు, నామినేటెడ్ పదవుల్లో అవకాశాలు ఉంటాయన్నారు. పార్టీకి వెన్నంటి నిలిచిన ప్రతి కార్యకర్తను ఆదుకుంటాం అని తెలిపారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వం సంక్షేమ, అభివృద్ధి పనులను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. టీడీపీలో మహిళల ప్రాధా న్యం మరింతగా పెరగాలని చెప్పారు. ఈ సమావేశంలో టిడిపి నియోజక వర్గ సమన్వయకర్త బన్నూరు రామలింగారెడ్డి, సీనియర్ నాయకులు గోవిందరెడ్డి, శివప్రసాద్ రెడ్డి, వేణు, అబ్దుల్లాపురం బాష, రాజేంద్రరెడ్డి, నియోజక వర్గస్థాయి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సర్వేపల్లి రాధాకృష్ణన్ వర్ధంతి

విశాలాంధ్ర -చాగలమర్రి: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో భారత మాజీ రాష్ట్రపతి, భారతరత్న సర్వేపల్లి రాధాకృష్ణన్ వర్ధంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపా ధ్యాయులు ఐడికే శాస్త్రి సర్వేపల్లి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ విద్యను అభివృద్ధి చేయడంలో సర్వేపల్లి సేవలు ఎనలేనివని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైభవంగా కాశీ పీఠాధిపతి అడ్డపల్లకి మహోత్సవం

విశాలాంధ్ర - హొళగుంద: హొళగుందలో గురువారం సాయంత్రం 7 గంటలకు కాశీ పీఠాధిపతి 1008 జగద్గురు మల్లికార్జున విశ్వ రాధ్య శివాచా ర్యుల అడ్డ పల్లకి మహోత్సవం వైభవంగా జరిగింది. పీఠాధిపతిని భక్తులు ద్విచక్ర వాహనాలతో భారీ ర్యాలీ నిర్వహించి పురవీధుల్లో ఊరేగిస్తూ స్వాగతించారు. స్థానిక దక్షిణామూర్తి స్వామి ఆలయం నుండి కాశీ పీఠాధిపతిని భక్తులు మేళ తాళాలు, సమేళ, రండోళ్ళతో పురవీధుల్లో ఊరేగించారు. పీఠాధిపతికి జై జై అంటూ భక్తులు నినాదాలు ఇచ్చారు. పీఠాధి పతిని భారీ సంఖ్యలో భక్తులు హాజరై భక్తి శ్రద్ధలతో నమస్కరించారు. స్థానిక సిద్దేశ్వర స్వామి గుడి వరకు భారీ ఊరేగింపు నిర్వహించారు. అడ్డ పల్లకి మహోత్సవంలో ఎస్సై దిలీప్ కుమార్ భారీ పోలీసు బందోబస్తు చేపట్టారు. పీఠాధిపతి భక్తులనుద్దేశించి ప్రసంగిస్తూ విశ్వశాంతి కోసం అందరూ శ్రమించాలని అన్ని ధర్మాల సారాంశం ఒకటేనని కులమతాలకు అతీతంగా జీవించాలని శాంతి సామరస్యంతో ఉండాలని ఉపదేశించారు. వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని, పాడిపంటలు కళకళలా డాలని, ప్రజలు ఆయురారోగ్యంతో ఉండాలని ఆశీర్వ దించారు. విశ్వ మానవులందరికీ జయం కావాలని ధర్మంతోనే ప్రపంచశాంతి ముఖ్య అవుతుందని పీఠాధిపతి ఉపదేశించారు. వీరశైవులు ధర్మానుసారం నడుచుకోవాలని ధర్మ బోధన పాటించాలని అన్నారు. భక్తులతో సిద్దేశ్వర స్వామి ఆలయం కిటకిటలాడింది. అడ్డ పల్లకి మహోత్సవంలో పీఠాధిపతులు వామదేవ మహా స్వాములు, నంది పుర మహేశ్వర శివాచార్యులు, చెన్న వీర మహాస్వామి, అజాత శంభు లింగస్వామి, శివయోగి మహాస్వామి, మరికొట్టూరు దేశి కేంద్ర మహాస్వామి హాజరయ్యారు. పురోహితుడు రేణుకా రాజ్యస్వామి, సిద్దయ్య స్వామి, గ్రామ పెద్దలు రాజా పంపనగౌడ, గాలి వీరభద్ర గౌడ, శివ శంకర గౌడ, సిద్ధార్థ గౌడ, అమరప్ప, కొత్రెష్, గవి, డిష్ మంజు, జాంటి వీరేష్, ఈశ్వరప్ప, శాంతవీర మూర్తి, బగ్గూరు మల్లికార్జున, బి.మల్లికార్జున, ఉల్లిగన్న, ప్రసాద్, చంద్రన్న, తిప్పన్న, భక్తులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

ఇంటర్ ఫలితాల్లో కేజీబీవీలో మెరిసిన విద్యార్థినులు

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన ఇంటర్ ఫలితాల్లో కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం విద్యార్థినిలు మంచి మార్కులు సాధించి తమ సత్తా చాటారు. ఆళ్లగడ్డ మండలం లోని పెద్ద కందుకూరు గ్రామంలో ఉన్న కస్తూరిబా గాంధీ గురుకుల విద్యాలయంలో కళాశాల ప్రిన్సిపాల్ సుందర కవిత, లెక్చరర్‌ల కృషి ఫలితంగా కళాశాల విద్యార్థినులు మంచి మార్కులు సాధించారు. అందు లో భాగంగా ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం ఎంఈసి గ్రూపులో నాగమణి 856 మార్కులు సాధించగా, కళ్యాణి 778 మార్కులు, ప్రవల్లిక 735 మార్కులు సాధించారు. మొదటి సంవత్సరం ఫలితాల్లో హరిత 394 మార్కులు, చాంద్ బీ 373 మార్కులు, సల్మా 366 మార్కులు సాధించారు. గత మూడు సంవత్సరాలుగా కేజీబీవీ విద్యార్థినిలు మంచి మార్కులు సాధిస్తున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఇంటర్ రెండవ సంవత్సరం పరీక్ష ఫలితాల్లో తమ విద్యార్థినిలు 83 శాతం ఉత్తీర్ణతను సాధించడం జరిగిందన్నారు. విద్యార్థినిలు ఎప్పటికప్పుడు చదువులో రాణించేలా తమ అధ్యాపక బృందం ప్రత్యేక కృషి చేస్తున్నారన్నారు.

గ్రామాల అభివృద్ధి ఎన్డీఏ ప్రభుత్వ లక్ష్యం

విశాలాంధ్ర - ఆత్మకూరు రూరల్ : గ్రామాలను అభివృద్ధి చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి అన్నారు. మండలంలోని వడ్లరామాపురం గ్రామంలో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా రూ.35 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లను శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పల్లెపండుగలో భాగంగా పల్లెలను అభివృద్ధి చేస్తూ నూతన సీసీ రోడ్లను నిర్మించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు శివప్రసాద్ రెడ్డి, జనసేన పార్టీ శ్రీశైలం నియోజకవర్గం ఇన్చార్జి శ్రీరాములు, టిడిపి నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలి

విశాలాంధ్ర - కోడుమూరు: బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలని, 5 ఏళ్ళు పైబడిన బాల,బాలికలను అంగన్వాడీ టీచర్ల సమన్వ యంతో ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు కృషి చేయాలని ప్రధానోపాధ్యా యులను ఎంఈఓ తైమూర్ బాష ఆదేశించారు. ఈ మేరకు గురువారం ఆయన జీవిఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ప్రధానోపా ధ్యాయులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా సంవత్సరం పూర్తికావస్తున్నందుకు 19 లోపు విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులు ఇవ్వాలన్నారు. 21 నుంచి 23వ తేదీ వరకు ఉన్నత తరగతులకు వెళ్లిన విద్యార్థులకు ఇండక్షన్ క్లాసులు నిర్వహించాలని సూచించారు. వచ్చే విద్యా సంవత్సరానికి బడి బయట ఉన్న పిల్లలందరిని బడిలో చేర్పించేందుకు ప్రధానో పాధ్యాయులు అందరూ కృషి చేయాలని కోరారు. 2024-25 విద్యా సంవత్సరంలో బడి మానేసిన 22మంది విద్యార్థులను తిరిగి బడిలో చేర్పించడం జరిగిందన్నారు. ఇందుకు కృషి చేసిన ప్రధానోపాధ్యాయులను ఆయన అభినందించారు. 2025-26 విద్యా సంవత్సరానికి తప్పనిసరిగా వందశాతం అడ్మిషన్లు పూర్తి చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

సచివాలయంలో వైద్య సేవలు.. వెనుదిరుగుతున్న ప్రజలు

విశాలాంధ్ర - రుద్రవరం: స్థానిక ఒకటో సచివాలయం లో గురువారం నంద్యాల పట్ట ణానికి చెందిన ఓ ప్రైవేట్ కార్పొరేట్ వైద్య శాల సిబ్బంది ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసింది. ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి వేదికగా నిర్మించిన సచివాల యాలంలో కార్పొరేట్ వైద్య సంస్థ ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడంతో సచివాలయం వద్దకు సమస్యల పరిష్కారానికి వచ్చిన గ్రామస్తులు దిక్కుతోచక వెనుదిరిగి పోవాల్సిన పరిస్థితి ఏర్పడింద గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. సచివాల యాల వద్దకు వచ్చే గ్రామస్తులకు ఇబ్బందులు లేకుండా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఆయుష్ యోగా సేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత కంటి శుక్లము ఆపరేషన్‌లు

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : ఆయుష్ యోగా సేవా సమితి నిర్వా హకులు ఖండే ఆనంద్ గురూజీ, కౌన్సిలర్ కండే శ్యాం సుందర్ లాల్ సహ తకారంతో ఉదయానంద హాస్పిటల్ కంటి వైద్య నిపుణులు డాక్టర్ పోగుల సౌమ్యరెడ్డిచే 13వ తేదీ సిరివెళ్ల నందు ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేసి సుమారు 60 మందికి శుక్లాలున్నట్లుగా గుర్తించారు. వీరిలో బుధవారం 13 మందికి, గురువారం 12 మందికి ఆపరేషన్ చేసి డిశ్చార్జ్ చేయగా మిగిలిన 35 మందికి శనివారం ఆపరేషన్ చేసి డిశ్చార్జ్ చేయడం జరుగుతుందని ఖండే ఆనంద్ గురూజీ తెలిపారు. మెడికల్ క్యాంపుకు పని ఒత్తిడి వలన రాలేని వారు డైరెక్టుగా ఉదయానంద హాస్పిటల్‌కి వచ్చి ఉచితంగా కంటి ఆపరేషన్ చేపించుకునే విధంగా డాక్టర్లను కోరడం జరిగిందన్నారు. ఆళ్లగడ్డ, నంద్యాల జిల్లాలోని అన్ని తాలూకా, మండల కేంద్రాలు, గ్రామాల్లో కూడా ఉదయానంద హాస్పిటల్ వారి సహకారంతో ఉచితంగా మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేసి వారికి ఆరోగ్య సమస్యలు తెలుసుకుని ఉచితంగా కంటి ఆపరేషన్ చేయడమే కాకుండా, ఆరోగ్య సమస్యలున్నా తమవంతు సహకారం అందిస్తామని కౌన్సిలర్ కండే శ్యాం సుందర్ లాల్, ఆనంద్ గురూజీ తెలిపారు.

మట్టి నమూనా సేకరణపై సిబ్బందికి శిక్షణ

విశాలాంధ్ర - పాములపాడు: పొలాలలో పోష కాల లోపం కనుగొనేం దుకు మట్టి సేకరణ కొరకు మండలం రైతు సేవ కేంద్ర సిబ్బందికి మండల వ్యవసాయ అధికారి ఫణీశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్ర మాన్ని గురువారం ఏర్పాటు చేశారు ఈ శిక్షణ కార్యక్రమానికి జిల్లా వనరుల కేంద్రం నంద్యాల వ్యవసాయ అధికారి హేమలత మట్టి పాల్గొని నమూనా సేకరించే విధానం ప్రతి 15 హెక్టార్లకు ఒక నమూనా సేకరించవలసిందిగా తెలియజేశారు, రైతు సేవ కేంద్రాల సిబ్బంది జీఎస్టి కోఆర్డినేట్లు ఎలాంటి మార్పులు లేకుండా ఖచ్చితంగా నమోదు చేయాలి మట్టి నమూనా సేకరించే టప్పుడు రైతుతో కలిసి సెల్ఫీ తీయాలి ఈ సెల్ఫీలో నమూనా సేకరణ స్థలం స్పష్టంగా వెనక కనిపించాలి మట్టి నమూనాలు సేకరణ మే 15 తారీకు లోపు పూర్తి చేయాలని ఆదేశించడం జరిగింది. అనంతరం పొలాలలో మట్టి సేకరణ సిబ్బందితో చేయించారు. ఈ కార్యక్రమానికి మండల వ్యవసాయ విస్తరణాధికారి దుర్గా చరణ్ మరియు రైతు సేవ కేంద్ర సిబ్బంది పాల్గొనడం జరిగింది.

ఘనంగా సర్వేపల్లి రాధాకృష్ణన్ వర్ధంతి

విశాలాంధ్ర -చాగలమర్రి: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో భారత మాజీ రాష్ట్రపతి, భారతరత్న సర్వేపల్లి రాధాకృష్ణన్ వర్ధంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపా ధ్యాయులు ఐడికే శాస్త్రి సర్వేపల్లి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ విద్యను అభివృద్ధి చేయడంలో సర్వేపల్లి సేవలు ఎనలేనివని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

19న స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర

విశాలాంధ్ర - శిరివెళ్ల : మండల పరిధిలోని ప్రతి గ్రామ పంచాయతీలో ఈ నెల 19న మూడో శనివారం స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించాలని ఎంపీడీవో సి.శివ మల్లేశ్వరప్ప తెలిపారు. శనివారం జరిగే స్వర్ణాంధ్ర స్వచ్ఛంద కార్యక్రమంపై గ్రామ ప్రజలందరికీ తెలిసే విధంగా వారిని భాగస్వాములను చేసుకుని కాలుష్య నివారణకు చేయూతనిచ్చే లాగా మైక్ అనౌన్స్మెంట్ దండో రాలు సోషల్ మీడియా ద్వారా తెలియజేయాలని తెలిపారు. 19న ఈ వేస్ట్ సేకరణ, ఆఫీస్ క్లీనింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్ వేస్టేజ్ వల్ల కలిగే అనర్థాల గురించి ర్యాలీలు, మనవ హారాలు, ప్రతిజ్ఞ కార్య క్రమాలు, నిర్వహించాలని ఆయా గ్రామ పంచాయతీ, రెవెన్యూ ఇతర ప్రజా ప్రతినిధులకు ఎంపీడీవో శివమల్లేశ్వరప్పా సూచించారు.

అవార్డు గ్రహీత వీరయ్యకు ఘన సత్కారం

విశాలాంధ్ర - ఆత్మకూర్ టౌన్ : ఆత్మకూరు పట్టణం జై భీమ్ జై భారత్ కమిటీ సభ్యుడు పుల్లయ్య మాట్లాడుతూ నంద్యాల స్థానిక గురురాజ స్కూల్ కోఆర్డినేటర్ వీరయ్య అంబేద్కర్ ప్రతిభ అవార్డు తీసుకున్న శుభ సందర్భంగా జై భీమ్ జై భారత్ ఆధ్వర్యంలో పూలమాల శాలువా అంబేద్కర్ జ్ఞాపికతో ఘనంగా సత్కరించారని జై భీమ్ జై భారత్ కమిటీ సభ్యులు పుల్లయ్య తెలిపారు. పాఠశాలలో విద్యార్థులకు నైతిక విలువలతో శిక్షణ విశిష్టమైన అందించిన గురురాజా స్కూల్ కోఆర్డినేటర్ వీరయ్యకు అంబేద్కర్ ప్రతిభ అవార్డు రావడం ఆనందకర విషయమని, జై భీమ్ జై భారత్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించాలని పుల్లయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో పీ ఈ టీ మున్ని తదితరుల ఉపాధ్యాయులు పాల్గొన్నారు అని తెలిపారు.

ఎస్సీ వర్గీకరణకు క్యాబినెట్ ఆమోదం హర్షనీయం

విశాలాంధ్ర - బనగానపల్లె: ఎస్సీ ఉప వర్గీకరణకు క్యాబినెట్ ఆమోదం తెలపడం హర్షనీయమని ఎమ్మార్పీఎస్ ఎంఎస్‌పి రాష్ట్ర కార్యదర్శి జయారాముడు, ఎమ్మార్పీఎస్ నంద్యాల జిల్లా అధ్యక్షుడు శివ నారాయణ తెలిపారు. స్థానిక టీడీపి కార్యాలయంలో పాత్రికేయులు సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ దళితుల అభివృద్ధి ప్రభుత్వంతో సాధ్యమని ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు మరోసారి రుజువు చేశారన్నారు. ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టు ఆమోదం తెలపడంతో రాష్ట్రంలో అమలు చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జి.దస్తగిరి, నాగాంజనేయ, మంద వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పేద రోగులకు సీఎం రిలీఫ్ ఫండ్ భరోసా

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : పేద రోగులకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో భరోసా నిస్తుందని ఎంపీ, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. గురువారం ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి కార్యాలయంలో బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మాట్లాడుతూ సీఎం రిలీఫ్ ఫండ్ భాదితులకు వెంటనే మంజూరు చేసి దైర్యం అందిస్తూ, ఆర్థిక భరోసా ఇస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలో ఆర్థిక కష్టాలు ఉన్నా పేద రోగులను ఆదుకునేందుకు సీఎం చంద్రబాబు ముందుంటున్నారన్నారు. తన లెటర్ ద్వారా పేద రోగులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నిధులు వెంటనే విడుదల చేసిన సీఎం చంద్రబాబుకు నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి కృతజ్ఞతలు తెలిపారు.

వజ్రోత్సవ వేడుకలకు ఆహ్వానం

విశాలాంధ్ర- కోవెలకుంట్ల: మహా కుంభాభిషేక వజ్రోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా నియోజకవర్గంలోని కోవెలకుంట్ల పట్టణంలోని శ్రీ వాసవి కన్యకారమేశ్వరి దేవి దేవస్థానం నందు మే నెల 4 తేదీ నుండి 8 తేదీ వరకు నిర్వహించడం జరుగుతుంది. ఈ మేరకు బనగానపల్లె పట్టణంలోని టంగుటూరి శీనయ్య కార్యాలయంలో గురువారం ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు, టీడీపీ వాణిజ్య విభాగాల జిల్లా అధ్యక్షులు, ఆర్యవైశ్య ప్రముఖులు టంగుటూరి శీనయ్యకి కోవెలకుంట్ల ఆర్యవైశ్య సంఘం పెద్దలు కలిసి ఆహ్వాన పత్రికను శీనయ్యకు అందజేశారు. ఆర్యవైశ్యులు ఐక్యంగా ఉండి అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలని శీనయ్య చెప్పారు. శ్రీ వాసవి కన్యకారమేశ్వరి అమ్మవారి మహా కుంభాభిషేక వజ్రోత్సవ వేడుకలు ఆర్యవైశ్యులందరూ కలిసి అత్యంత భక్తిశ్రద్ధలతో విజయవంతం చేయాలని శీనయ్య స్వామి అకాంక్షించారు.